

ఉపాధి కల్పన.. ఆర్థికస్వావలంబన

మహిళలు ఆర్థికస్వావలంబన సాధించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తోంది. -8లో..



గ్రామ సమాఖ్య నిధుల స్వాహాపై విచారణ

వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథంలో గ్రామ సమాఖ్యల నిధుల స్వాహాకు సంబంధించి డీఆర్‌డీఏ పీడీ విచారణ చేపట్టారు. -8లో..



క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన

కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన లభించింది. -8లో..

న్యూస్‌రీల్

వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు

కడప అగ్రికల్చర్: గుంటూరుకు చెందిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జూలైలో ప్రారంభంకానున్న నాలుగు ఆన్‌లైన్ కోర్సులైన సేంద్రియ వ్యవసాయం, మిద్దెతోటలు, తేనెటీగలు, పుట్టగొడుగుల పెంపకం కోర్సులకు రెండునెలల పాటు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తారన్నారు.ఆసక్తి ఉన్న వారు ఒక్కో కోర్సుకు రూ. 15 వందల చొప్పున ఫీజు చెల్లించాలన్నారు. నమోదు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ సదుపాయం(కంప్యూటర్, ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్, ఐపాడ్) కలిగి ఉండాలన్నారు. ఆసక్తికలవారు తమ పేర్లను జూలై 20వ తేదీలోపు నమోదు చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు వ్యవసాయ విశ్వ విద్యాలయం వెబ్‌సైట్ www.angrau.ac.inను సందర్శించాలని తెలిపారు. అలాగే 80087 88776, 83096 26619, 9110562727 నంబర్లో ఉదయం 9 గంటల నుంచి 7 గంటల వరకు సంప్రదించవచ్చని వీరయ్య తెలిపారు.

కేజీబీవీల్లో పీఈటీ పోస్టుకు..

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని 29 కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో స్పోర్ట్స్ కేటగిరీలో ఖాళీగా ఉన్న ఒక పీఈటీ పోస్టుకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పోస్టుకు , జాతీయ, రాష్ట్రస్థాయి, యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత గల మహిళా అభ్యర్థులు ఈ నెల 26 నుంచి 28వ తేదీ సాయంత్ర 5 గంటలలోపు కడపలోని సమగ్రశిక్ష కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు. సంబంధిత దరఖాస్తు కడపలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో అందుబాటులో ఉందని అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

సీపెట్ డిప్లమో కోర్సులకు జూన్ 30 వరకు గడువు

కడప ఎడ్యుకేషన్: విజయవాడలోని భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్, విజయవాడ) వారు 2023-24 విద్యా సంవత్సరానికి జాబ్ ఓరియెంటెడ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీపెట్ జాయింట్ డైరెక్టర్ చింతా శేఖర్ తెలిపారు. ఇందులో 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లమో, 2 సంవత్సరాల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో కోర్సులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.దరఖాస్తుకు జూన్ 30 వరకు గడువు ఉందని ఆయన చెప్పారు. ఇప్పటికే నిర్వహించిన సీపెట్ కామన్ అడ్మిషన్ టెస్టు ఫలితాలు వెలువడినప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో 10వ తరగతి సప్లిమెంటరీ విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఫేస్-2 ఎంట్రన్స్ టెస్టును నిర్వహించి వారికి, బీఎస్సీ విద్యార్హత గల అభ్యర్థులకు తుది అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల వారు 6300147965 నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సీపెట్ జాయింట్ డైరెక్టర్ చింతా శేఖర్ తెలిపారు.

కబడ్డీ సంఘంలో జిల్లా సభ్యులకు చోటు




గోవర్ధన్‌రెడ్డి జనార్ధన్

కడప స్పోర్ట్స్: ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గంలో జిల్లా కబడ్డీ సంఘం ప్రతినిధులకు చోటు దక్కింది. ఆదివారం బాపట్లలో నిర్వహించిన ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డిని రాష్ట్ర ఉపాధ్యక్షుడుగాను, కోశాధికారిగా ఉన్న టి. జనార్ధన్‌ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

నాటా మహాసభలకు చక్రవర్తిరెడ్డికి ఆహ్వానం



కడప కార్పొరేషన్: నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్(నాటా) ఆధ్వర్యంలో అమెరికాలోని డల్లాస్‌లో జూన్ 30 నుంచి జూలై 2వ తేదీ వరకు జరుగనున్న మహాసభలకు వైవీయూ పాలకమండలి మాజీ సభ్యులు, ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డికి ఆహ్వానం అందింది. ఈయన శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ మాజీ సెనెట్ మెంబర్ కూడా కావడంతో విద్యాసంస్థల్లో సంస్కరణలు, నూతన విద్యా విధానంపై ఆయనకు అవగాహన ఉంది. ఈ నేపథ్యంలో నార్త్ అమెరికాలో జరుగబోయే నాటా మహాసభల్లో పాల్గొని 'విద్యా సంస్కరణలు, నూతన విద్యా విధానం'గూర్చి సభలో ప్రసంగించేందుకు ఆయనను నాటా అధ్యక్ష, కార్యదర్శులు డా. శ్రీధర్‌రెడ్డి కొర్సపాటి, నారాయణరెడ్డి గండ్రలు ఆహ్వానించారు. ఈ మహాసభలకు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుంచి 15000 మంది తెలుగువారు పాల్గొననున్నట్లు అంచనా. రాయలసీమ జిల్లాలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, విద్యాసంస్థల అధిపతులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎత్తిపోతలు..తీరుతున్న వెతలు

- అన్నదాతకు ఆయువుపట్టుగా లిఫ్ట్ ఇరిగేషన్
- టీడీపీ హయాంలో ఆయకట్టు 3000 ఎకరాలు మాత్రమే
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక భారీగా పెరిగిన ఆయకట్టు
- పెండింగ్ పనులను పూర్తి చేస్తున్న ప్రభుత్వం
- డిసెంబరు నాటికి జీకేఎల్ఐ, పీబీసీ, సీబీఆర్ కింద లక్ష ఎకరాలకు నీటి సౌకర్యం



లోమడ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

కడప సిటీ : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి రాగానే జలయజ్ఞం పేరిట రైతులను ఆదుకునేందుకు పలు ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టారు. అందులో భాగంగా గండికోట నుంచి పైడిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ డ్యాం పనులను చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. 2004లో రిజర్వాయర్‌తో కలిపి రెండు పంప్ హౌస్‌ల ఏర్పాటుకు రూ. 720 కోట్ల అంచనా వ్యయం కాగా, అప్పట్లోనే 90 శాతం మేర పనులను కూడా పూర్తి చేశారు. ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు, టీడీపీ ప్రభుత్వం ఈ పనులపై దృష్టి సారించలేదు. దీంతో ఆయకట్టుకు నీళ్లు చేరే పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక మిగిలిన పనులను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరిచ్చేందుకు శ్రద్ధ వహించారు. గండికోట ప్రాజెక్టు నుంచి పైడిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ డ్యామ్‌కు ఆరు టీఎంసీల నీటిని కేటాయించారు. ఇందుకుగాను గండికోట నుంచి 10.2 కిలోమీటర్ల మేర రెండు పైపులైన్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా 72 మీటర్ల ఎత్తుకు నీటిని పంపింగ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోగండికోట లిఫ్ట్ ఇరిగేషన్ (జీకేఎల్ఐ) కింద మూడు వేల ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 35000 ఎకరాలకు ఆయకట్టు పెరిగింది. అంతేకాకుండా పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) నుంచి చివరి ఆయకట్టు వరకు మరో 45,500 ఎకరాలకు నీళ్లిచ్చేందుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. డిసెంబరు చివరి నాటికి డిస్ట్రిబ్యూటరీ, మైక్రో ఇరిగేషన్ సంపుల ద్వారా లక్ష ఎకరాలకు నీళ్లిచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

వైఎస్సార్ హయాంలోనే 90 శాతం పనులు

గండికోట ప్రాజెక్టు నుంచి పైడిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ డ్యామ్‌కు ఆరు టీఎంసీలు, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 10 టీఎంసీల నీటిని కేటాయించారు. ఈ పథకాలు 2004లో వైఎస్సార్ హయాంలోనే ప్రారంభమయ్యాయి. ఇందుకు రూ. 720 కోట్ల నిధులను కేటాయించారు. రెండు పైపులైన్ల ద్వారా వరద ఉధృతి కాలంలో ఒక్కో పైపులైను ద్వారా 500 క్యూసెక్కుల నీటిని తరలించేందుకు పథకాన్ని రూపొందించారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతోపాటు 2019 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మిగిలిన పనులను పూర్తి చేయలేకపోయారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిస్ట్రిబ్యూటరీ పనులను చేపట్టారు. రూ. 30 కోట్లతో టెండర్లు పిలిచి 80 శాతం పనులు పూర్తి చేశారు. మిగతా పనులు అక్టోబరు నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు.

- పైడిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ కింద 2019 వరకు టీడీపీ హయాంలో కేవలం మూడు వేల ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మిగిలిన పనులను పూర్తి చేయడంతో ప్రస్తుతం 35000 ఎకరాలకు నీళ్లందే పరిస్థితి ఏర్పడింది.

70 కిలోమీటర్లు పొడవుగల డిస్ట్రిబ్యూటరీ

గండికోట నుంచి పైడిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు వరద ఉధృతి ఉన్న పరిస్థితుల్లో 120 రోజుల్లో సెకండ్‌కు వెయ్యి క్యూసెక్కుల నీటిని తరలించే పరిస్థితి ఉంటుంది. ఈ నీటి ద్వారా సింహాద్రిపురం, తొండూరు మండలాలకు సంబంధించి 35 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు, 18 చెరువులు నింపడం, తాగునీరు అందించడం, భూగర్భ జలాలు అడుగంటకుండా మైక్రో ఇరిగేషన్ సంపుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టడం చేశారు.ప్రస్తుతం అన్ని చెరువుల్లో జలకళ సంతరించుకుంది. భానుకోట, బూచుపల్లె, మల్లేల, లోమడ, గంగాదేవిపల్లె, తొండూరు, ఊడవగండ్ల చెరువులకు నీళ్లు ఇవ్వడంతో పాటు గంగనపల్లె, నారేపల్లె చెరువులను మరో వారం రోజుల్లో నీటిని నింపేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇందుకోసం 70 కిలోమీటర్ల పొడవు మేర డిస్ట్రిబ్యూటరీ పనులను పూర్తి చేశారు.

పీబీసీ ద్వారా 45,500 ఎకరాలకు నీళ్లు

పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ)కి సంబంధించి 55,500 ఎకరాల ఆయకట్టు ఉండగా, డిసెంబరు నాటికి 45,500 ఎకరాలకు నీళ్లు ఇవ్వాలన్నది లక్ష్యం ప్రస్తుతం డిస్ట్రిబ్యూటరీ, పూడికతీత పనులను 250 కిలోమీటర్ల మేర చేపట్టారు. చిత్రావతి నుంచి పీబీసీ ద్వారా వేంపల్లె, వేముల, పులివెందుల మండలాల్లోని ఆయకట్టుకు నీటిని అందించనున్నారు. డిసెంబరు చివరి నాటికి పీబీసీ కింద ఉన్న పనులన్నీ పూర్తయి డిస్ట్రిబ్యూటరీ, మైక్రో ఇరిగేషన్ సంపుల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు పనులను అధికారులు వేగవంతం చేశారు.

మొత్తం ఆయకట్టు 1,62,400 ఎకరాలు

గండికోట రిజర్వాయర్ నుంచి పైడిపాలెం, చిత్రావతి, పీబీసీకి నీరు అందుతోంది. ఈమూడు పథకాలకు సంబంధించి ఆయకట్టు 1,62,400 ఎకరాలు ఉంది. సీబీఆర్ కింద 59,400 ఎకరాల ఆయకట్టు ఉండగా 20 వేల ఆయకట్టుకు, పైడిపాలెం ప్రాజెక్టు కింద 45,500 ఎకరాల ఆయకట్టు ఉండగా 35 వేల ఎకరాలకు, పీబీసీ కింద 55,500 ఎకరాల ఆయకట్టు ఉండగా 45,500 ఎకరాలకు సాగునీరు డిసెంబరు నాటికి అందిచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు



గండికోట లిఫ్ట్ ఇరిగేషన్, పులివెందుల బ్రాంచ్ కెనాల్ , చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాం. ఈ మూడింటి కింద లక్షా 62 వేల 400 ఎకరాలు ఉండగా డిసెంబరు నాటికి లక్ష ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.
– మల్లికార్జునరెడ్డి, ఎస్ఈ, జీఎన్ఎస్ఎస్, కడప

శరవేగంగా పనులు



ఈ మూడు పథకాలకు సంబంధించి ప్రస్తుతం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మైక్రో ఇరిగేషన్ సంపులకు సంబంధించి భూ సేకరణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టాం. ప్రస్తుతం పనుల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నాం. పురోగతి సాధించేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం.
– వి.విజయరామరాజు,కలెక్టర్, వైఎస్సార్ జిల్లా

ఒబెరాయ్‌కు కేటాయించిన భూమి పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్

జమ్మలమడుగు: మండల పరిధిలోని పర్యాటక కేంద్రమైన గండికోటలో ఒబెరాయ్ సంస్థకు కేటాయించిన భూమిని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆదివారం ఆర్డీఓ జి.శ్రీనివాసులు, సర్వేయర్లు లక్ష్మీప్రసన్న, హరిలతో కలిసి పరిశీలించారు. గండికోటను పర్యాటకకంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. గతేడాది ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు గండికోటలో పర్యటించి 400 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఆ సంస్థకు 50 ఎకరాలు లీజుకు కేటాయించింది. 250 కోట్ల రూపాయలతో 120 విల్లాలను ఏర్పాటు చేసేవిధంగా ప్రణాళికలను రూపొందిస్తామని సంస్థ ప్రతినిధులు అప్పట్లో పేర్కొన్నారు. అందులో భాగంగా ఒబెరాయ్ యాజమాన్యానికి ఏ స్థలం అనువైనదో జేసీ పరిశీలించారు.

ట‘మోత’!

మదనపల్లె: అన్నమయ్య జిల్లా మదనపల్లె టమాటా మార్కెట్‌యార్డులో ఈ ఏడాది సీజన్ ప్రారంభమయ్యాక ఎన్నడూ లేని విధంగా ఆదివారం రికార్డుస్థాయిలో మొదటిరకం కిలో టమాటా ధర రూ.80 పలికింది. మార్కెట్‌కు రైతులు 933 మెట్రిక్‌టన్నుల టమాటాను విక్రయించేందుకు తీసుకురాగా, బయటిప్రాంతాల వ్యాపారులు పోటీపడి అధిక ధరలకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం మదనపల్లె మార్కెట్ నుంచి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, కోస్తా ఆంధ్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని పలుప్రాంతాలకు సరుకు ఎగుమతులు జరుగుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో స్థానికంగా సరుకు లభ్యత లేకపోవడం, టమాటాకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో అక్కడి నుంచి వ్యాపారులు మదనపల్లెకు వచ్చి సరుకు కొనుగోలు చేస్తున్నారు.

సౌమ్యనాథుని బ్రహ్మోత్సవాలకు వేళాయే!

- రూపుదిద్దుకుంటున్న కళ్యాణ వేదిక
- ఎమ్మెల్యే మేడాచే వేలాదిమందికి అన్నప్రసాదాలు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీపీ, డిప్యూటీ ఈఓ



సౌమ్యనాథస్వామి కల్యాణానికి సిద్ధమవుతున్న వేదిక

నందలూరు(రాజంపేట): ఈనెల 27 నుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు టీటీడీ సోమవారం ఏర్పాట్లు పూర్తి చేయనుందని నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి , టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్‌బాబు తెలిపారు. ఆదివారం సౌమ్యనాథాలయ ప్రాంగణంలో కోనేరు, కళ్యాణవేదిక, అన్నప్రసాదాల కౌంటర్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి సుందరంగా స్వామివారి కళ్యాణవేదిక రూపుదిద్దుకుంటోందన్నారు. ఇందుకు సంబంధించి పనులు చకచకా జరుగుతున్నాయన్నారు. కోనేరు చుట్టూ శాశ్వతంగా ఇనుప కంచెను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతిరోజు అన్నమాచార్య ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో సంగీత, హరికథ, బుర్రకథ కార్యక్రమాలు నిర్వహించేలా ఆ ప్రాజెక్టు డైరెక్టరు విభీషణశర్మను కోరామన్నారు. సౌమ్యనాథాలయ మాడ వీధుల్లో, అలాగే బస్టాండు ఆర్చి వరకు టీటీడీకి సంబంధించి ఫ్లెక్సీలే తప్ప మరెవ్వరివి కూడా ఉండరాదనే నిబంధనను పోలీసులు అమలుచేయనున్నారు. ఆలయ మాఢవీధుల్లో పరిశుభ్రత, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా ఆయా శాఖలు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. అలాగే టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో ఆలయంలో లడ్డూ విక్రయాలు జరపనున్నట్లు తెలిపారు.

నేడు మేడా విజయభాస్కర్‌రెడ్డి దంపతులచే టీటీడీకి ముత్యాలు

సౌమ్యనాథుని కళ్యాణంలో ముత్యాల తలంబ్రాల కార్యక్రమం టీటీడీ నిర్వహించనుంది. ఇందుకు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేడా పద్మజ దంపతులు సోమవారం ఆలయ సంప్రదాయ పద్ధతిలో ముత్యాలను టీటీడీ అధికారులకు అందజేయనున్నారు. అలాగే ఈనెల 4న జరిగే సౌమ్యనాథస్వామి కళ్యాణోత్సవానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదాలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో అందజేస్తారని ఎంపీపీ తెలిపారు.

‘విశ్వ’ఖ్యాతి చాటిచెబుదాం

యోగివేమన విశ్వవిద్యాలయం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని.. బోధన, పరిశోధన రంగాల్లో మరింత మెరుగైన పనితీరుతో దక్షిణ భారతదేశంలోనే అగ్రగామి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూ నూతన వైస్ చాన్సలర్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ఆయనతో జరిపిన ఇంటర్వ్యూలో పలు విషయాలు పంచుకున్నారు. – వైవీయూ

- విద్యాసంస్కరణల్లో మేటిగా ఏపీ
- ఈ ఏడాది నుంచి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ అందుబాటులోకి
- వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



ఆచార్య చింతా సుధాకర్, వైస్ చాన్సలర్, వైవీయూ

సాక్షి ఇంటర్వ్యూ

ప్రశ్న: వైవీయూ వీసీగా నియమితులు కావడంపై మీ స్పందన..?

జవాబు: యోగివేమన విశ్వవిద్యాలయం నాలుగో వైస్ చాన్సలర్‌గా పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. వర్సిటీకి సేవచేసేందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

ప్ర: విశ్వవిద్యాలయ ప్రగతికి ఎలాంటి విజన్‌తో ముందుకెళుతున్నారు..?

జ : విశ్వవిద్యాలయం ఇప్పటికే చక్కటి ప్రగతిపథంలో నడుస్తోంది. అత్యుత్తమ అర్హతలు కలిగిన అధ్యాపకులు, యంగ్‌సైంటిస్టులతో విశ్వవిద్యాలయ ప్రగతి బాగుంది. ఇందుకు నిదర్శనం న్యాక్ ‘ఏ’గ్రేడ్. రానున్న రోజుల్లో న్యాక్ ‘ఏ’ప్లస్ ప్లస్ సాధించడం, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో టాప్-100లో నిలవడమే మా ప్రధాన లక్ష్యం. ఇందుకు అవసరమైన చర్యలను ఇప్పటి నుంచే ప్రారంభించాం.

ప్ర: బోధనలో మెరుగుదల, పరిశోధన ప్రాజెక్టుల పెంపునకు ఎలాంటి చర్యలు చేపట్టారు..?

జ: విశ్వవిద్యాలయంలో అనుభవజ్ఞులైన ఆచార్యుల వారి సేవలను విద్యార్థులకు కచ్చితంగా అందించాలని కోరాం. అధ్యాపకులు, సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు చేపట్టాం. ప్రాజెక్టులు కేటాయించే పరిశోధన సంస్థలు కొన్ని నిబంధనలు పెట్టడంతో ప్రాజెక్టులు, నిధులు రావడం ఆలస్యమవుతోంది. పరిశోధక ప్రాజెక్టులపై దృష్టిసారిస్తాం. ఇందుకు అవసరమైన సహకారాన్ని పరిశోధకులు, అధ్యాపకులకు అందిస్తాం. ప్రతి అధ్యాపకుడికి సీడ్ మనీ అందజేస్తూ ప్రోత్సాహం అందిస్తున్నాం. అధ్యాపకులు ప్రముఖ జర్నల్స్‌లో పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరాం.

ప్ర: వైవీయూ ఆధ్వర్యంలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభం అవుతుంది..?

జ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో రెగ్యులర్ బోధనతో పాటు దూరవిద్యా విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నాం. ఇందుకు అవసరమై అనుమతులు, ప్రక్రియను ఇప్పటికే దాదాపుగా పూర్తిచేశాం. చిన్నచిన్న సాంకేతిక అనుమతులు మినహా ప్రక్రియ పూర్తయింది. 2023-24 విద్యాసంవత్సరంలోనే డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభించేందుకు కృషిచేస్తున్నాం.

ప్ర: విశ్వవిద్యాలయం పరిపాలనలో ఎలాంటి సంస్కరణలు తీసుకురానున్నారు..?

జ: విశ్వవిద్యాలయాన్ని పేపర్ ఫ్రీగా మార్చుచేయాలన్న లక్ష్యంతో ఈ- ఆఫీస్ విధానాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాం. ఈ-ఆఫీసును అన్ని విభాగాలతో అనుసంధానం చేసేలా చర్యలు చేపట్టాం. అన్ని శాఖల అభివృద్ధి, అప్‌డేట్ సమచారాన్ని ప్రపంచానికి తెలియజెప్పేలా ఎప్పటికప్పుడు ఆయా విభాగాల వెబ్‌సైట్‌లను ఆధునీకరిస్తున్నాం. అన్నిచోట్ల పర్యవేక్షణకు వీలుగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేయనున్నాం.

ప్ర: విద్యార్థుల వసతిగృహాలు, మెస్ సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపుతారు..?

జ: విశ్వవిద్యాలయంలో విద్యార్థులు చక్కగా చదువుకునే ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది. క్యాంపస్‌లో అతిపెద్ద లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీ అందుబాటులో ఉంది. వసతి గృహాలను ఇప్పటికే పలుమార్లు సందర్శించి విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాం. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ ఉండేలా వార్డెన్‌లకు ఆదేశాలు ఇచ్చాం. విద్యార్థుల భోజనశాల, పరికరాలు, సామగ్రి, పరిసరాల పరిశుభ్రత విషయంలో రాజీలేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకున్నాం.

ప్ర : ఉన్నతవిద్యలో వస్తున్న సంస్కరణల గురించి మీ అభిప్రాయం..?

జ: నూతన జాతీయ విద్యావిధానం విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. ఎన్ఈపీ-20 అమలులో ఇంకా చాలా రాష్ట్రాలు ఆలోచిస్తున్న సమయంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుచూపుతో అమలుచేసిన తొలి రాష్ట్రంగా నిలిచింది. ఏపీ ఉన్నతవిద్యామండలి ఆధ్వర్యంలో తీసుకొచ్చిన సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం విద్యార్థులను ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించే సామర్థ్యాలను అందించేలా ఉండనుంది.

ప్ర: విద్యార్థులకు మీరిచ్చే సందేశం..?

జ: తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థానాలకు చేరుకోవాలి. పోటీపరీక్షలకు సన్నద్ధం కావడం, ఉద్యోగ అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. నేర్చుకోవాలన్న తపనతో అధ్యయనం చేయడంతో పాటు పట్టుదలతో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలి.

ప్ర: వర్సిటీలో చదివే విద్యార్థికి ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు..?

జ: విశ్వవిద్యాలయంలో చదువుకునే విద్యార్థి అకడమిక్ అంశాలతో పాటు సమాజ అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలు పెంపొందించుకునేలా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కెరీర్ పట్ల స్పష్టమైన అవగాహన పెంపొందేలా కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. విజేతలు, నిపుణులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. వీటిని సద్వినియోగం చేసుకుని పలువురు విద్యార్థులు పెద్దప్యాకేజీతో ఉన్నతకొలువులు సైతం పొందారు.

అరుణాచలానికి ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు



కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో పౌర్ణమి సందర్భంగా జూలై 3న గిరిప్రదక్షిణ జరగనుంది. ఇందుకోసం వెళ్లే ప్రయాణికుల కోసం 2వతేదీ కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రత్యేక ప్యాకేజి కింద రానూ పోనూ ఒక్కొక్కరికి కడప నుంచి రూ.1072, ఇంద్ర రూ. 1384,పులివెందుల నుంచి రూ.1242, మైదుకూరు నుంచి ఇంద్ర రూ.1604, ప్రొద్దుటూరు నుంచి ఇంద్ర రూ.1604, జమ్మలమడుగు నుంచి రూ.1352 టికెట్ ధర నిర్ణయించినట్లు వివరించారు.ఆసక్తి గల వారు సీట్లు రిజర్వ్ చేసుకోవాలని సూచించారు. అలాగే ఒకే బ్యాచ్‌గా 30 మంది ఉంటే ప్రత్యేకంగా బస్ సర్వీసు ఏర్పాటు చేసి పికప్, డ్రాపింగ్ చేస్తామని చెప్పారు. ఇతర వివరాలకు ఆయా డిపో మేనేజర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

షిర్డీకి ప్రత్యేక బస్సు

గురుపౌర్ణమి సందర్భంగా జూలై 1న ప్రొద్దుటూరు డిపో నుంచి షిర్డీకి ఏసీ బస్సును ఏర్పాటు చేశామని ఆర్ఎం తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు ప్రొద్దుటూరు నుంచి బయలుదేరి ఆలంపూర్, జోగులాంబ అమ్మవారి ఆలయం, తుల్జాపూర్ భవాని మాత ఆలయం, శని శింగణాపూర్ ఆలయాలను సందర్శించవచ్చన్నారు. రానూ పోనూ రూ.4600 ధరగా నిర్ణయించామన్నారు. మైదుకూరు, ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు ప్రాంతాల నుంచి కూడా టికెట్ రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరం చిన్నచౌకులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. సహదేవ రెడ్డి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 29 నుంచి జూలై 2వ తేదీ వరకు ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించనున్న 8వ జూనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును ప్రకటించారు.

ప్రభుత్వ చౌక బియ్యం పట్టివేత

చెన్నూరు : చెన్నూరు పాత బస్టాండ్ వద్ద అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ చౌక బియ్యాన్ని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఆటోతోపాటు 20 బస్తాల చౌక బియ్యాన్ని వారు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఉపాధి కల్పన.. ఆర్థిక స్వావలంబన

- రూ.170 కోట్లతో 13 ఎకరాల్లో ఆదిత్య బిర్లా గార్మెంట్స్
- 2 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు
- 400 మందితో బట్టల తయారీ పనులు



కుట్టుమిషన్ పనిలో నిమగ్నమైన మహిళలు



ప్యాంట్లను ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

పులివెందుల రూరల్ : ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వ పరంగా వారికి పథకాలు అందిస్తున్నారు. మరో వైపు పరిశ్రమలు ఏర్పాటు చేయించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. తద్వారా వారిని సొంత కాళ్లపై నిలబడి, కుటుంబాన్ని పోషించుకునేలా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా పులివెందుల పట్టణ శివారులో 13 ఎకరాల్లో సుమారు రూ.170 కోట్లతో ఆదిత్య బిర్లా గార్మెంట్స్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ఇప్పటికే గార్మెంట్స్ పనులు 60 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. డిసెంబర్ నాటికి పూర్తి చేసి 2 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2021 డిసెంబర్ 24న ఆదిత్య బిర్లా గార్మెంట్స్ పరిశ్రమకు పులివెందులలో శిలాఫలకం వేశారు. ఆదిత్య బిర్లా గార్మెంట్స్ యాజమాన్యం ఉత్పత్తులు ప్రారంభించే విధంగా.. పెద్ద రంగాపురం గ్రామ సమీపంలో ఉన్న ఏపీ కార్ల్‌లో ఆసక్తి గల మహిళలకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. శిక్షణలో కూడా వారికి రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు వేతనాలు ఇవ్వడం జరుగుతోంది. ప్రస్తుతం మహిళలు ప్యాంట్లు, షూట్ తయారీలో నిమగ్నమై ఉన్నారు. పులివెందుల నియోజకవర్గంలోనే కాక కడప, ధర్మవరం, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చి పని చేస్తున్నారు. వారికి సమీప ప్రాంతాల నుంచి బస్సు, ఆటో సౌకర్యం కల్పించారు. ఆసక్తి గల వారు శిక్షణ పొంది ఉద్యోగ అవకాశాలు పొందవచ్చును.

కుటుంబానికి ఆసరాగా..



మాది రచ్చుమర్రిపల్లె గ్రామం. ఇంటి దగ్గర ఖాళీగా ఉండకుండా, కుటుంబానికి సహాయ సహకారాలు అందించడానికి నిర్ణయించుకున్నా. అదే సమయంలో ఆదిత్య బిర్లా గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు చేశారు. అందులో చేరి, శిక్షణ పొందుతున్నాను.

- దివ్యశ్రీ, ఆదిత్య బిర్లా కంపెనీ ఉద్యోగిని, పులివెందుల

నిరుద్యోగులకు వరం



పులివెందులలో ఆదిత్య బిర్లా పరిశ్రమ ఏర్పాటు చేయడం నిరుద్యోగ మహిళలకు వరం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదిత్య బిర్లా పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేయించడం చాలా ఆనందంగా ఉంది. మహిళలందరూ ఆయనకు ఎంతో రుణపడి ఉంటారు.

- పూజిత, ఆదిత్య బిర్లా కంపెనీ ఉద్యోగిని, పులివెందుల

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మహిళలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెంది లక్షాధికారులు కావాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. కుటుంబంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆదిత్య బిర్లా గార్మెంట్స్‌లో చేరాను. అక్కడ శిక్షణ పొంది ఇప్పుడు ఉద్యోగం చేస్తూ నెలకు రూ.10 వేలు సంపాదిస్తున్నా.

- సరిత, ఆదిత్య బిర్లా కంపెనీ ఉద్యోగిని, పులివెందుల

2 వేల మందికి ఉపాధి అవకాశాలు



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రోత్సాహంతో పులివెందుల ప్రాంతంలో ఆదిత్య బిర్లా గార్మెంట్స్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. 2 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఈ ప్రాంతంలో గార్మెంట్స్ ఏర్పాటు చేయడం మాతోపాటు ఇక్కడి ప్రజల అదృష్టం.

- జయకుమార్, మేనేజర్, ఆదిత్య బిర్లా కంపెనీ, పులివెందుల

దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది



బహిరంగ సభలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

ప్రొద్దుటూరు క్రైం : బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలన 9 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ప్రొద్దుటూరులోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఆదివారం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సత్యకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 5 వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, ఎంపీ సీఎం రమేష్, పార్టీ ప్రధాన కార్యదర్శి బిత్రా శివనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్నాటి ఎల్లారెడ్డి, ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు, పార్టీ పట్టణాధ్యక్షుడు సుబ్రమణ్యం, నరేష్‌కుమార్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పనిగట్టుకుని ప్రతిపక్ష నేతల విమర్శలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనపై ప్రతిపక్ష నేతలు పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నాయని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ అన్నారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో బీజేపీ తొమ్మిదేళ్ల పరిపాలనపై మేధావుల సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షులు యల్లారెడ్డి, నాయకులు బాలకృష్ణారెడ్డి, సింగారెడ్డి రామచంద్రారెడ్డి, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఒకే గ్రామంలో రెండిళ్లలో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

సంబేపల్లె : మండల పరిధి రెడ్డివారిపల్లె పంచాయతీలోని పాములవారిఇండ్లలో శనివారం రాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని బి.నాగరాజు, కుటుంబ సభ్యులు తిరుమలకు వెళ్లారు. ఈ క్రమంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపు తాళం పగలగొట్టి లోపలికి వెళ్లి బంగారు చైను, రెండు ఉంగరాలు అపహరించారు. అదే విధంగా మద్దిపట్ల రెడ్డినారాయణ నివాసంలో చోరీ జరిగింది. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ లింగప్ప, ఎస్ఐ షరీఫ్ పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఢీకొన్న ద్విచక్ర వాహనాలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టౌన్ బ్రాంచ్ సమీపంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక సుందరయ్యకాలనీకి చెందిన షేక్ మహబూబ్‌బాషా తన ద్విచక్ర వాహనంలో నెల్లూరు రోడ్డులో వెళుతూ ముందు వెళుతున్న శివానగర్‌కు చెందిన శ్రీను అనే వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో మహబూబ్‌బాష కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన మహబూబ్‌బాషాను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆయనను కడప రిమ్స్‌కు తరలించారు. అలాగే ఈ ఘటనలో శ్రీను అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

శ్రీనివాసులరెడ్డి హత్య కేసులో నిందితుల అరెస్ట్‌కు రంగం సిద్ధం

- మరో కీలక వ్యక్తికి నోటీసులు జారీ చేసిన పోలీసులు
- ప్రధాన నిందితుడు ప్రతాప్‌రెడ్డి వద్ద నుంచి రూ.కోట్ల విలువ గల డాక్యుమెంట్లు సీజ్
- నేడో రేపో మీడియా ముందు ప్రవేశ పెట్టే అవకాశం

కడప అర్బన్ : వైఎస్ఆర్‌సీపీ నాయకుడు చిన్ననాగిరెడ్డి గారి శ్రీనివాసులరెడ్డి (42) దారుణ హత్య కేసును జిల్లా పోలీసు యంత్రాంగం ఛేదించింది. కొన్ని రోజులుగా కీలక నిందితులు పక్కాగా వ్యూహం పన్నినట్లు స్పష్టమైంది. శ్రీనివాసులరెడ్డికి, ప్రధాన నిందితుడు ప్రతాప్‌రెడ్డికి ఇద్దరికీ వెన్నుదన్నుగా నిలిచిన మరో కీలక వ్యక్తికి కూడా ఈ హత్యలో ప్రమేయం వుందని పోలీసులు ఆదివారం నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆ వ్యక్తికి సంబంధించిన వ్యాపార సంస్థల వద్దనే రోజుల తరబడి కీలక నిందితుడు ప్రతాప్‌రెడ్డి, మరి కొంత మందితో గంటల తరబడి మంతనాలు చేసినట్లుగా పోలీసులకు సీసీ ఫుటేజీల ఆధారాలు లభించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రతాప్‌రెడ్డి స్వగృహంలో నిర్వహించిన సోదాలలో కోట్లాది రూపాయల విలువైన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, అగ్రిమెంట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసు ఛేదించడంలో ప్రమేయమున్న అందరిపైనా పోలీసులు నిష్పక్షపాతంగా, చట్ట పరిధిలో శిక్షించేందుకు కృషి చేస్తున్నట్లు సమాచారం. శ్రీనివాసులరెడ్డి వ్యతిరేకుల ప్రమేయం, వ్యాపార లావాదేవిల్లో నెలకొన్న వివాదాలు, భాగస్వాముల మధ్య భేదాభిప్రాయాలు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు వర్గాల సమాచారం.

గురువారం రాత్రి మట్టుబెట్టేందుకు మాటు వేసిన ప్రధాన నిందితుడు

శ్రీనివాసులరెడ్డిని హత్య చేసేందుకు గురువారం రాత్రి కూడా మాటు వేసినట్లు తెలుస్తోంది. ఒకప్పటి అనుకూలమైన సహచరుడుగా ఉంటూ దాదాపు ఏడాదిగా దూరంగా ఉన్న ఎర్రముక్కపల్లెకు చెందిన గుంటీ నాగేంద్ర సమీప బంధువులచే శ్రీనివాసులరెడ్డిని డిన్నర్‌కు ఆహ్వానించారు. డిన్నర్ ముగించుకొని రాజీవ్‌మార్గ్ ప్రధాన రహదారిలో శ్రీనివాసులరెడ్డి వచ్చే అవకాశం ఉంటుందనే భావనతో.. సమీపంలో ప్రధాన నిందితుడు మాటు వేసి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే శ్రీనివాసులరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి డిన్నర్‌కు హాజరు కావడం, వెహికల్‌లో వెళ్లి రావడంతో హత్య పథక రచన అమలు చేయలేకపోయినట్లు సమాచారం. శుక్రవారం ఉదయం మాటు వేసి, పక్కా ప్రణాళిక బద్ధంగా బుర్ఖాలు ధరించి హత్యాకాండను అమలు చేశారు.

ప్రత్యక్ష, పరోక్ష సహకారంపై ప్రత్యేక దృష్టి

శ్రీనివాసులరెడ్డి హత్యలో ప్రత్యక్ష, పరోక్షంగా ప్రధాన నిందుతులకు సహకరించిన వారిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈక్రమంలో ఓ వ్యాపారవేత్తతో ప్రధాన నిందితుడు ప్రతాప్‌రెడ్డి చేపట్టిన లావాదేవిలపై కూపీ లాగినట్లు సమాచారం. హత్యాకాండలో పాల్గొన్న వారికి మృతుడు శ్రీనివాసులరెడ్డి మధ్య నెలకొన్న వివాదాలను సరిపోల్చుకుంటున్నారు. అయితే హత్య తర్వాత ప్రధాన నిందితుడు ప్రతాప్‌రెడ్డికి సహకరించిన వ్యక్తులపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి స్కూటర్‌పై ఒక చోటి నుంచి మరో ప్రాంతానికి ప్రతాప్‌రెడ్డిని తరలించినట్లు కూడా పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆపైన డయల్ 100కు సమాచారమిచ్చిన పిదప పోలీసులకు దొరికిపోయేలా చాకచక్యంగా వ్యవహరించినట్లు సమాచారం. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎండీ షరీఫ్, కడప వన్‌టౌన్ సీఐ ఎన్‌వి నాగరాజు, కడప రూరల్ సీఐ కె.అశోక్‌రెడ్డి, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి ఈ హత్య కేసులో ఇప్పటికే కీలక ఆధారాలను, ప్రతాప్‌రెడ్డితోపాటు, ఇతర నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో నిందితుల్ని మీడియా ముందు హాజరు పర్చనున్నట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన చెన్నయ్య

బి.కోడూరు : బి.కోడూరు మండలంలో దంతెలపల్లె గ్రామ సమీపాన ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నల్లవాగుపల్లె గ్రామానికి చెందిన మద్దినేని చెన్నయ్య పోరుమామిళ్ళ నుంచి బైక్‌పై తన స్వగ్రామానికి వస్తుండగా.. బద్వేలు నుంచి పోరుమామిళ్ళకు కారు వెళ్తోంది. మార్గమధ్యలోని దంతెలపల్లె గ్రామ సమీపాన ఈ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చెన్నయ్య ఎడమ కాలు పూర్తిగా విరిగిపోవడంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో పోరుమామిళ్ళ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కడపకు తీసుకెళ్లారు. బి.కోడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ సమాఖ్య నిధుల స్వాహాపై విచారణ



వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్

వల్లూరు : వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథంలో పలు గ్రామ సమాఖ్యల నిధుల స్వాహాకు సంబంధించి డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ విచారణ చేపట్టారు. ఇప్పటికే లీగల్ కంప్లైన్స్ కో ఆర్డినేటర్లను విచారణకు ఆదేశించిన ఆయన ఆదివారం వల్లూరులోని వైఎస్ఆర్ కేపీ కార్యాలయానికి వచ్చి స్వయంగా విచారణను పర్యవేక్షించారు. ఇందులో భాగంగా ఆయన నిధుల స్వాహా జరిగిన గ్రామ సమాఖ్యలకు సంబంధించి ఒక్కో గ్రామ సమాఖ్య రికార్డులను తనిఖీ చేసి సంబంధిత వీవోఏలను పలు అంశాలపై ప్రశ్నిస్తూ వివరాలను ఆరా తీశారు. అనంతరం కార్యాలయ రికార్డులను పరిశీలించి సిబ్బందితో వాటికి సంబంధించిన వివరాలను ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిధుల స్వాహా విషయమై విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విచారణ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం థర్డ్ పార్టీ విచారణ నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని అన్నారు. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, దుర్వినియోగం అయిన నిధులను రికవరీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ ప్రసాద్, డీపీఎమ్ (ఐబీ) హర ప్రసాద రాజు, లీగల్ కంప్లైన్స్ కో ఆర్డినేటర్లు శ్రీనివాసులు, సుజాత, నాగార్జున, ఏపీఎం శైలజ, వీవోఏలు పాల్గొన్నారు.

క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. అండర్-14, అండర్-16 విభాగాల్లో నిర్వహించిన ఎంపికలను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రాబబుల్స్‌కు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం మ్యాచ్‌లు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామని ప్రకటించారు. అనంతరం ఎంపికలను నిర్వహించగా, అండర్-14 విభాగంలో 130 మంది క్రీడాకారులు హాజరు కాగా 65 మందిని ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశారు. అండర్-16 విభాగంలో 100 మంది క్రీడాకారులు హాజరుకాగా 45 మందిని ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశారు. ఎంపికల్లో సీఏవైడీ కోశాధికారి మహేంద్రారెడ్డి, సంయుక్త కార్యదర్శి సాయిపృథ్వి, మునికుమార్‌రెడ్డి, ఎస్.మహమ్మద్ దౌలా, సుబ్రమణ్యం, శివప్రసాద్, విష్ణుమోహన్, ఆనంద్, అబుబకర్ పాల్గొన్నారు.



క్రికెట్ ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

ఆషా‘ఢాం’.. కొత్త జంటలు దూరం!

- నెల రోజుల ఎడబాటు
- ప్రారంభమైన ఆషాఢం
- కొత్త జంటలకు నెలరోజుల విరహం

కడప కల్చరల్ : ఆషాఢం...కొత్తగా పెళ్లయిన జంటలకు శత్రువు. జీవిత భాగస్వామి గురించి పూర్తిగా తెలుసుకోకముందే నెలరోజులపాటు వారిని దూరంగా ఉంచే మాసం. అప్పుడప్పుడే కొత్త జీవితం ఆశల పందిరిని అల్లుకుంటూ మొగ్గలు కాసి పువ్వులయ్యే పరిణామం. అత్తగారింటికి అర్థం చేసుకునేందుకు ప్రయత్నాలు జరిగే సమయం...ఆషాఢ మాసం. నిజానికి ఈ మాసం పేరిట వధూవరుల మధ్య కలిగే ఎడబాటు వారిని మానసికంగా మరింత దగ్గర చేస్తుంది. ఒకరంటే మరొకరు తపించిపోయేలా మారుస్తుంది. ‘మనుషులు దూరమైతే మనసులు దగ్గరవుతాయి’ అంటే ఇదే కాబోలు. ప్రకృతి శరీరాల మధ్య అవగాహనతో పెద్దలు ఆషాఢం ఎడబాటును శాస్త్రీయంగా తప్పనిసరి చేశారు. నెలరోజులపాటు కొత్త జంటకు ఆషాఢ విరహం తప్పదు. వివాహం ద్వారా భౌతికంగా, సామాజికంగా ఒకటి చేసిన సంప్రదాయాన్ని ఆషాఢం మానసికంగా మరింత గట్టి పరుస్తుంది. అత్తాకోడళ్లు, మామా అల్లుళ్లు ఈ మాసంలో ఒకే ఇంటిలో ఉండకూడదని, ఒకరినొకరు ఎదురవ్వకూడదని పెద్దలు అంటారు.

ఎందుకిలా..

ఆషాఢమాసం మొదలయ్యే నాటికి వర్షాలు కురుస్తాయి. కాస్త ఆలస్యమైనా జిల్లాలో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఈ తొలకరిలో కొత్త నీరు వస్తుంది. మారుతున్న ఇలాంటి వాతావరణంలో అనుకూల, ప్రతికూల మార్పులను తట్టుకుని నిలవాలన్నదే ఆషాఢం సందేశం. కొత్త జంటలలో అమ్మాయి ఈ మాసంలో అత్తగారింట్లో ఉండకూడదన్న సంప్రదాయం బాగా ప్రచారంలో ఉంది. శారీరకంగా, మానసికంగా అప్పుడప్పుడే భర్తకు దగ్గరవుతున్న కొత్త కోడళ్లు ఈ ఎడబాటు ద్వారా కలిగే ప్రేమ వారి భవిష్య జీవితానికి ఎంతో ఉపయోగపడుతుందంటారు. ఈ మాసం నూతన జంటలను కొన్నాళ్లపాటు విడదీసి విరహంలో ముంచుతుందని మాత్రమే భావించాల్సిన అవసరం లేదు. వారి మధ్య బంధాన్ని ఈ ఎడబాటు మరింతగా బలపరుస్తుందన్న అవగాహన కలిగి ఉండాలి. కానీ ఈ ఆధునిక కాలపు జంటకు నెలరోజులపాటు విరహం, బాధ ఉండదు. వివాహమైన నెలరోజులకే ఉద్యోగం చేసే చోట కొత్త కాపురం పెట్టేస్తుండడంతో అత్తాకోడలు ఒకే ఇంటిలో ఉండే నిబంధన వారికి వర్తించదు. దీంతో విరహంలోని తియ్యదనాన్ని నేటితరం జంటలు ఆస్వాదించే అవకాశం లేదు. నెలరోజుల తర్వాత అంటే శ్రావణమాసంలో మెట్టినింటివారు అమ్మాయికి చీర, సారె పెట్టి ఆశీర్వదించి మంగళ ప్రదంగా తమ ఇంటికి తీసుకు వస్తారు. ఇక్కడితో ఆషాఢ మాసపు ఎడబాటు ముగుస్తుంది. ఆషాఢమాసమంతా హిందువులు ఎలాంటి శుభకార్యాలు నిర్వహించరు. వివాహాలు తదితర శుభకార్యాలు ఉండవు గనుక బంగారం కొనరు. నెలరోజుల తర్వాత శ్రావణ మాసం రాగానే ఈ విరామానికి తెరపడుతుంది. ఆ తర్వాత రానున్న పండుగలు, వ్రతాలకు తగిన ఏర్పాట్లు చేసుకుంటూ సిద్ధమవుతారు.

ప్రకృతి పరంగా

వైశాఖ, జేష్ట మాసాలు శుభ కార్యాలతో కళకళలాడతాయి. ఈనెల 19 నుంచి ఆషాఢ మాసం ప్రారంభమైంది. తెలుగు సంవత్సరంలో నాల్గవ నెల ఆషాఢమాసం. ఈ నెలలో పౌర్ణమిరోజు చంద్రుడు నక్షత్రాలకు దగ్గరగా వస్తాడు. సంక్రాంతి నుంచి ప్రారంభమైన ఉత్తరాయణాన్ని శుభకార్యాలు, పండుగలకు నెలవుగా పేర్కొంటారు. అందుకే ఈ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి పర్వదినంగా, పౌర్ణమిని గురుపౌర్ణమిగా నిర్వహించుకుంటారు. ఆషాఢంలో ఆధ్యాత్మిక వేత్తలు చాతుర్మాస దీక్షలు ప్రారంభిస్తారు. అనంతరం వచ్చే శ్రావణమాసంలో పండుగలు, వ్రతాలు ఉంటాయి. ఈ మాసంలోనే వర్షాలు ప్రారంభమై సూక్ష్మజీవులు పుడతాయని, కొత్త రోగాలను కలగజేసే ప్రమాదముందంటారు.